


''అయ్యోయ్ ముసిలి రాజయ్య చచ్చిపోయాడు'' ఇంట్లో అడుగు పెడుతూనే చెప్పాడు రాఘవులు.

''ఎప్పుడు?'' నారాయణ అడిగేలోపునే కొడుకు వెళ్ళి పోయాడు.

''చస్. సరిగా సమాధానం కూడా చెప్పకుండా వెళ్ళిపోయాడు. అసలు బాధ్యత ఎరిగినోడైతేగా'' అని కొడుకును తిట్టుకున్నాడు.

నారాయణ తోపుడు బండి మీద కూరగాయలు అమ్ముతుంటాడు. వయసు పైబడటం వల్ల తిరగలేకపోతున్నాడు. కొడుకు సంగతి చూస్తే చదవడానికి పదో తరగతి వరకు చదివాడు కాని ఏ ఉద్యోగంలోను పట్టుమని పది రోజులు వుండడం లేదు. అదని, యిదని తిరుగుతూనే వున్నాడు. జులాయి వెధవలతో సావాసం ఒకటి. వాడి తల్లేమో వాడికి పెళ్లి చెయ్యమని, ఇంట్లో తనకో తోడు వుంటుందని ఒకటే గోల. మరి నిలకడలేని సన్నాసికి పిల్లనిచ్చేదెవరు? తోపుడు బండి నడపడం వాడికి నామోషీ. కూచుని చేద్దామంటే వ్యాపారం సుళువుగా సాగడానికి సరైన జాగాయే లేదు. అప్పటికే మునిసిపాలిటీ వాళ్ళకు ఒక అర్జీ పెట్టుకున్నాడు. తనకి తెలివితేటలుండి కాదు ఆ పని చేస్తే. వకీలుగారి పుణ్యం. వకీలు గారంటే అలాంటిలాంటాయన కాదు ఏ కేసైనా సరే సూది బెజ్జం అంత సందు దొరికితే చాలు మనిషిని అవతల్నుంచి ఇవతలికి లాగేస్తాడు. వకీలుగారెండు చేతులా ఆర్జిస్తున్నాడు ఆయనీ మధ్య రాజకీయాల్లోకి దూకాడు. అధికార పక్షం వాళ్ళు ఏదో పదవినిస్తామన్నా అందరినీ ఆశ్చర్యపరుస్తూ ప్రతిపక్షంలో చేరాడు. ఆయనేదో గొప్ప లెక్కే అయ్యుంటుందనుకున్నారు ఆయనెరిగినోళ్ళంతా.

రాఘవులు క్లబ్బులో పని చేసేటప్పుడు వకీలు గారితో పరిచయమయింది. వీడు ఆయన కోరీ కోర్లక ముందే ఆయన క్కావలసిందేమిటో చిటికెలో గ్రహించి అందించేవాడు. సిగరెట్లేమిటి, పాన్లేమిటి, టెన్నిస్ ఆడేటప్పుడు బంతులేమిటి. వకీలుగారికి రాఘవులు అభిమానపాత్రుడయ్యాడు. ఆయనకి తన తండ్రి కోరిక చెప్పినప్పుడు ఓ అర్జీ పడేసుంచమని సలహా యిచ్చాడు. కానీ ఆయనకి తీరికేదీ! చూడాలి ఎప్పటికవుతుందో.

ఆలోచన్ల నుంచి తేరుకున్నాడు నారాయణ. అంతలోకి 'ముసిలి రాజయ్య' విషయం గుర్తుకొచ్చింది. రాజయ్యకు, తనకు వయసులో కాస్తంత తేడా వున్నా మంచి స్నేహమే. 'పాపం రాజయ్య' అనుకుంటూ అతనింటి కేసి బయల్దేరాడు.

***

ముసిలి రాజయ్యకు సెంటర్‌లో రోడ్డు మీద పళ్ళ దుకాణం వుంది. వ్యాపారం మహా జోరు మీదుండేది. ముసిలి రాజయ్య అంటే ముసలి వాడేం కాదు. వయసు నలభయ్యేదు దగ్గరలో వుంటుంది. చిన్న వయసులోనే తలంతా నెరిసిపోవడంతో ఎరిగున్న వాళ్ళంతా 'ముసిలోడా' అని, 'ముసిలి రాజయ్య' అని పిలవనారంభించారు. అలా ముసిలి అనేది అతని ఇంటి పేరైపోయింది. పెళ్ళయిన నాలుగేళ్ళకే పెళ్ళాం జబ్బు చేసి చనిపోయింది. పిల్లల్లేరు. ఎంచేతనో మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. తనే ఇంత వుడకేసుకుని తినేవాడు. చనిపోతే తల కొరివి పెట్టేవాళ్ళు లేరని ఓ కుర్రాడిని చేరదీశాడు. వాడు కొంతకాలం రాజయ్యకు దుకాణంలో సాయపడినట్టే సాయపడి నాలుగు డబ్బులు చేతపుచ్చుకుని పారిపోయాడు. చుట్టుపక్కల వాళ్ళు అతను డబ్బు కూడబెట్టే వుంటాడనే నమ్మకంతో నలభయ్యో పడిలో అతడికి పిల్లనివ్వడానికి ముందుకొచ్చారు. అతనేమీ ఆసక్తి ప్రదర్శించలేదు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంగా వుందని అతను కొట్టు తెరవలేదు. ఇప్పుడీ వార్త. దుకాణం నడిపేందుకు రాజయ్య తరఫు ఎవరూ లేరు.

***

నారాయణ అక్కడకు చేరుకునేసరికి జనం బాగానే పోగడ్డారు. రాజయ్య దగ్గర అప్పు తీసు

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

కోని వాళ్ళు, తీసుకున్న వాళ్ళలో బాకీ చెల్లగొట్టిన వాళ్ళు, తీర్చుదామనుకుంటున్న వాళ్ళు, ఎగ్గొడ దామనుకునే జనం, తీసుకుందాం అనుకుంటున్న వాళ్ళు అందరూ చేరారు.

మొదటి వర్గం వాళ్ళు రాజయ్య మంచితనాన్ని నెమరేసుకున్నారు. రెండవ వర్గం వాళ్ళు రాజయ్యను ఎదుటి వాళ్ళకు సహాయపడే తత్వం గలవాడిగా పొగిడారు.

మూడో వర్గం వాళ్ళు అప్పు తాలూకు డబ్బు ఇప్పుడు ఎవరికివ్వాలో అనుకున్నారు. నాలుగో వర్గం బాగా సంతోషించింది. మనసులో ఓ మూల పశ్చాత్తాపం లాంటిది ఏదో కలిగినా మొత్తానికి ఎక్కువగానే సంతోషించారు. ఐదో వర్గం వాళ్ళు అప్పు కోసం ఎవరి దగ్గర కెళ్ళాలా అని ఆలోచనలో పడ్డారు. ఇలా జనం బాగానే చేరారు. మంచి మనిషి కదా. ఈశ్వరయ్య కూడా వచ్చాడు. అతను రాజయ్యకు దూరపు చుట్టం. కార్ఖానాలో పనిచేసి రిటైరయ్యాడు.

ఈశ్వరయ్యది పేద కుటుంబమే కాక పెద్ద కుటుంబం కూడా. ఇల్లు గడవడం కష్టంగా వుంది. పిల్లలెవరికీ పెళ్ళిళ్ళు కాలేదు. చూపు ఆనని తల్లి, విధవరాలైన అక్కగారితో అతడి కుటుంబం పూర్తవుతుంది. పెద్ద కూతురికి ఇరవై ఐదు నడుస్తుంది. చిన్న కూతురు కూడా పైట లేస్తోంది. కొడుకు వీర్రాజు కండలు పెంచి అవిలేని, వున్నా వుపయోగించలేని, వాటి అవసరం ఎంతో వున్న కొందరి వెంట తిరుగుతుంటాడు. ఏం సంపాదిస్తాడో, ఎలా సంపాదిస్తాడో తెలీదు కాని వాడు మాత్రం దర్జాగా వుంటాడు. దుబారాగా ఖర్చు పెట్టేస్తాడు. అసలు ఈశ్వరయ్యకి రాజయ్య తన పెద్ద కూతుర్ని చేసుకుంటాడేమో అనడగాలనుండేది. 'వయసులో పెద్ద తేడా ఏం లేదు. పదిహేనేళ్ళగా' అన్నాడు కొడుకుతో. ఆ మాట వింటూనే వీర్రాజు ఖస్సుమని లేచాడు. నా చెల్లెలికి రాజా లాంటి సంబంధం చేస్తాను. ముసలోడికిచ్చి చెయ్యాల్సిన ఖర్మేం పట్టలేదు. ఆ ఆలోచన మానుకోమని హెచ్చరించాడు.

పాడెని పైకి ఎత్తారు. గొల్లుమనడానికి ఎవరూ లేరు. రాజయ్య ఇంటిగలాయన తన దగ్గర రెండు నెలల ఇంటి అద్దె అడ్వాన్సుగా వున్న డబ్బు ఖర్చు పెడుతున్నాడు. చేబదుళ్ళు తీసుకున్న వాళ్ళు కొందరు ఆ డబ్బు కూడా ఆయన చేతిలోనే పెట్టారు. ఇంటి యజమాని కుటుంబానికి, రాజయ్యకు వున్న అనుబంధం వల్ల ఆయన కొడుకే కొరివి పెట్టాడు.

'ఇవాల్టి నుంచి మనం పొదుపు చేద్దాం. నేను రోజూ నీకు ఐదు రూపాయిలిస్తా. దాన్ని ఈ డబ్బాలో దాస్తుండు' చెప్పాడు భర్త. సరేనంది భార్య.

నెలరోజుల తర్వాత డబ్బా మూత తీసిన భర్తకి పదులూ, యాభై నోట్లు కూడా కనిపించాయి.

'ఇవన్నీ ఎక్కడివి?' అడిగాడు భర్త.

'ఎక్కడివేంటి? అందరూ మీలాగా పిసినార్లను కున్నారా? ఐదు రూపాయలివ్వడానికి' విసుక్కుంది భార్య.

— గొల్లపూడి శైలజ

దహనకాండ పూర్తయ్యాక అందరూ వెనుదిరిగారు.

"ఏం అన్నా బాగున్నావా?" పరిచయస్తులే కావడంతో నారాయణ ఈశ్వరయ్యను పలుకరించాడు.

"ఆ అదే బాగు" ఏదో ఆలోచనలో వున్న ఈశ్వరయ్య సమాధానమిచ్చాడు.

నడుస్తూ మధ్య మధ్యలో ఒకటీ, అరా మాట్లాడుతున్నారే కాని ఇద్దరి మనసుల్లోనూ ఏవో సందేహాలు, సమాధానాలు.

ఇద్దరూ నడుస్తున్న దారి ఒక్కటే.

***

రాఘవులు తండ్రికి సరిగా సమాధానం చెప్పకుండా వెళ్ళింది ఎక్కడికో కాదు. యెకా యెకిని వకీలు గారింటికి వెళ్ళాడు. ఆయనతో చెప్పవలసింది చెప్పాడు. వకీలుగారు వెంటనే కమీషనరుకు ఫోన్ చేశాడు. ఇదేమంత పన్లే అనుకుని కమీషనర్ మాట యిచ్చేశాడు. పైగా అర్జీ ఒకటి వుండనే వుంది.

"నాలుగు రోజులు పోనివ్వండి. పన్నులు కట్టే సమయం వస్తోంది కదా. అప్పుడు చేసేద్దాం" అన్నాడు.

***

ఈశ్వరయ్య ఇంటికి చేరేసరికి వీర్రాజు ఇంట్లోనే వున్నాడు. తన ఆలోచనేమిటో కొడుకుతో చెప్పాడు. తండ్రి వేపో చూపు పారేశాడు వీర్రాజు. కార్ల కంపెనీ యజమాని కారు బొమ్మ కొనివ్వమని మారాం చేస్తున్న కొడుకుని చూసినట్టుందా చూపు.

"నువ్వెందుకు కష్టపట్టం. హాయిగా రెస్టు తీసుకోక. నే సంపాయిస్తాగా" అన్నాడు.

'నువు సంపాయించింది ఇంట్లోయిస్తే బాగానే వుండేది' అని మనసులో అనుకుని "ఊరక యింట్లో కూచుని ఏం చేస్తాను. అదేదో ఆడే కూచుంటా" అన్నాడు.

"సర్లె నీ యిష్టం. ఎమ్మెల్యే నడిగితే మరీ సీపుగా వుంటుందేమోనని ఆలోచించా" అని వెళ్ళిపోయాడు వీర్రాజు.

* * *

ఊళ్ళో ఎమ్మెల్యే ఎలా వుంటాడో కూడా చాలా మందికి తెలీదు. ఎంచేతనంటే ఎన్నికలపుడు వాడు ఇంకెవడిదో (అట్ట) తలకాయ ముఖానికి అడ్డంగా పెట్టుకుని గెలిచాడు. అలాంటి వాడికి తను కుడి భుజాన్ని (ఆంగ్లంలో అయితే కుడి చెయ్యి) అనుకుంటాడు వీర్రాజు.

వీర్రాజు స్నేహితులు వాడికి ముద్దుగా 'రవాణా పౌర సరఫరాల మంత్రి' అని పేరు పెట్టారు. పార్టీ మీటింగ్‌లకి జనాన్ని పోగెయ్యడనికి రవాణా సౌకర్యాలు, తనపై నాయకులకి పిల్లి కావాలంటే పిల్లిని, పిల్ల కావాలంటే పిల్లని సరఫరా చెయ్యడం తదితర పనులు చూస్తుంటాడు.

* * * *

ఎమ్మెల్లే కమీషనరు మీద ఫోన్లో మండ పడ్డాడు.

"ఏంటయ్యా నువ్ చెప్పేది. నా కన్నా వకీలే ఎక్కువయ్యాడా నీకు? ఏమిటి మాటిచ్చావా? తీసేసుకో వెనక్కి. నాకు ముందే మాటిచ్చావని, ఆ విషయం చెప్పడం మర్చిపోయానని బొంకు"

"ఆర్డరేసానండి" నసిగాడు కమీషనరు. కష్టమ్మీద చెప్పాడు అబద్ధం.

"ఆర్డరు వాడి చేతికిచ్చావా?"

"లేదండి" ఇంక అబద్ధమాడ దల్చలేదు. ఎమ్మెల్లే వకీలుకు ఏ విధంగాను తీసిపోడు. ఇచ్చానంటే "ఏ రోజు ఇచ్చావు? కుడి చేత్తో ఇచ్చావా? ఎడం చేత్తో ఇచ్చావా?" అంటూ ఊదరగొట్టేస్తాడు.

"అయితే చించెయ్. నీకు చేతకాకపోతే నా దగ్గరకు తీసుకురా నే చించేస్తా."

* * *

ఇక మొదలయింది ప్రచ్ఛన్న యుద్ధం. బజార్లో మళయాళీ వాడి దుకాణం దగ్గర వీర్రాజు, వాడి మిత్ర బృందం చాయ్ తాగుతున్నారు ఓ రోజు.

"బళ్ళు ఓడలవ్వడానికి ప్రయత్నిస్తున్నాయిరోయ్" అటుగా వచ్చిన రాఘవులు కేసి ఓరగా చూస్తూ అన్నాడు వీర్రాజు.

వీర్రాజు ఒకడ్నే అయితే రాఘవులు మట్టి కరిపించేవాడే. కాని వాడి పక్క నలుగురు అనుచరులున్నారు. అందరితో ఒకేసారి తల పడడానికి అతనేమీ సినిమాల్లో కథా నాయకుడు కాదు కమక ఊరుకున్నాడు. ఏ విధంగా దెబ్బ తీయ్యాలా అని ఆలోచించాడు.

రాఘవులికి అవకాశం వచ్చింది. వీర్రాజు ఒక్కడే వుండగా రాఘవులు ఓ బాణం వదిలాడు.

"కాబోయే మంత్రిగారి బాబు బంట్రోతు ఉద్యోగానికి ఎగబడుతున్నాడల్లే వుందే"

వీర్రాజు కొరకొరా చూశాడు. వీర్రాజుకి కౌన్సిలర్ అవుదామని, ఛైర్మన్ అవచ్చని, ఎమ్మెల్లే అవ్వొచ్చు అని, తర్వాత ఇంకేదైనా అవుతానేమోనని ఆశ మరి.


రాఘవులు స్నేహితుడొకడు పాత కక్షల కారణంగా వీర్రాజు ముఠాలోని మస్తాన్రావుని ఒంటరిగా చూసి చితకతన్నాడు. ప్రతీకార చర్యగా వీర్రజు ముఠా రాఘవులు స్నేహితులిద్దరిని సెంటర్లో అందరూ చూస్తుండగా చావ తన్నారు.

దేశాల మధ్య సరిహద్దు సమస్యలు, ఒకే దేశంలోని రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు, రెండు ముఠాల మధ్య ఘర్షణలు చూస్తున్న వాళ్ళు ఈ గొడవని మొదట పెద్దగా పట్టించుకోలేదు. ఎపుడైతే కొట్లాటలు మొదలయ్యాయో అపుడు నలుగురు కలిసి రెండు వర్గాల వాళ్ళకి సర్ది చెప్పబోయారు. కుర్రాళ్ళు 'మీ పని మీరు చూసుకోండి' అన్నారు. మనసుల్లో ఏముందో కాని నారాయణ, ఈశ్వరయ్యలు మాత్రం మౌనంగా వుండిపోయారు.

ఓసారి బజార్లో నారాయణ, ఈశ్వరయ్యలు ఒకరికొకరు ఎదురుపడినా వారికి వాళ్ళు చూడనట్టుగా వెళ్ళిపోయారు.

జిల్లాకు చెందిన మంత్రి గారు పర్యటన కొచ్చినపుడు ఊళ్లో కొట్లాటల గురించి ఎమ్మెల్లేని వాకబు చేశారు. జాగా విషయం విని 'చిన్న దానికి గొడవెందుకండి' అన్నారు. ఎమ్మెల్లే ఆ జాగా ప్రాముఖ్యతని వివరించాడు. అది గాని సాధించకపోతే తన మీద ప్రజలకున్న నమ్మకం ఎలా తగ్గిపోతుందో, సెంటర్లో ఓట్లు ఎన్ని చేజారిపోతాయో, ముఖ్యంగా వకీలుకి రాజకీయంగా ఎంత ప్రాముఖ్యత పెరిగిపోతుందో విశదీకరించాడు. తద్వారా తనకు, తన పార్టీకి, ప్రజలకు తద్వారా దేశానికి సేవ చేసే అదృష్టం తప్పిపోయే ప్రమాదాన్ని సూచిస్తూ ఆందోళనను, బాధను వ్యక్తపరిచాడు.

ఈ మధ్య కాలంలో కమీషనరు ఒక ప్రతిపాదన చేశాడు. మరో జాగా వుందని, ఒకళ్ళు దాన్ని ఉపయోగించుకోవచ్చని. నారాయణ, ఈశ్వరయ్యలు రెండో జాగా




తీసుకోవడానికి ఎవరికి వాళ్లే సుముఖతని వ్యక్తం చేశారు. వీర్రాజు, రాఘవులు వీల్లేదన్నారు. సెంటర్లో జాగాయే కావాలన్నారు.

రెండు వర్గాల మధ్య వైరం రోజు రోజుకి పెరిగిపోతోంది. ఇపుడు ఒంటరిగా తిరగడానికి ఎవరూ సాహసించడం లేదు. అటు వీర్రాజు బృందానికి, ఇటు రాఘవులు స్నేహితులకి కూడా ఈ పరిస్థితి ఇబ్బందికరంగానే వుంది. రోజూ ఎక్కడో అక్కడ కొట్లాట జరిగినట్టు వార్తలొస్తూనే వున్నాయి.

కమీషనరు మరో ప్రతిపాదన కూడా చేశాడు. సెంటర్లో జాగా అలా వదిలేసి నారాయణ, ఈశ్వరయ్యలకు వేర్వేరు స్థలాలు ఇస్తానన్నాడు. వీర్రాజు, రాఘవులు ఇదేదో బాగానే వుందనుకున్నారు. తండ్రి పోరు మీద వీర్రాజు కమీషనరు తాజా ప్రతిపాదన గురించి ఎమ్మెల్లేని కదిపి చూశాడు.

"నీ గురించి ఇంత కష్టపడుతుంటే నన్ను వకీలుకి తల వంచమంటావా? మరోసారి ఈ మాట ఎత్తావంటే నీకూ, నాకూ సంబంధం లేనట్టే" చిరచిరలాడాడు ఎమ్మెల్లే.

వీర్రాజు తండ్రితో అంతే కోపంతో ఇవే మాటలన్నాడు. వకీలు శిబిరంలో కూడా ఇలాంటి సంఘటనే జరిగి సంధి యత్నాలు బెడిసి కొట్టాయి.

సంధి కుదరనపుడు మరి జరిగేది యుద్ధమే కదా.

ఒకరోజు ఉదయాన్నే ఎమ్మెల్లే సలహా మీద వీర్రాజు స్నేహితుడొకడు ముసిలి రాజయ్య జాగాలో కూరగాయల కొట్టు పెట్టాడు. ఈ వార్త ఊళ్ళో దావాలనంలా పాకింది. వకీలు యస్సైకి ఫోను కొట్టాడు. కమీషనరు ఫిర్యాదు చేస్తే ఏదైనా చెయ్యగలనన్నాడు యస్సై. కమీషనరు ఊళ్ళో లేదు. వకీలు రాఘవుల్తో పరిస్థితి 'చర్చించాడు'. రాఘవుల రక్తం సలసల కాగిపోయింది. అన్నిటికీ తెగించ దల్చుకున్నాడు. తన స్నేహితుల్తో కలిసి సెంటర్లో ఆ కొట్టు దగ్గరికి ఆవేశంగా నడిచాడు. కొట్టు ముందు వీర్రాజు ఠీవిగా నిల్చునున్నాడు. వాళ్ళూ సిద్ధంగానే వున్నారు. రెండు వర్గాల వాళ్ళు ప్రేలడానిక సిద్ధంగా వున్న డైనమైట్లలా వున్నారు. కసిగా వున్నారు. కక్ష తీర్చుకోవడం అనే ఆవేశం మినహా వాళ్ళ మనసుల్లో ఇంకే ఆలోచనా లేదు.

మాటలు పెరిగాయి. మాటలు చేతల్లోకి దిగాయి. కర్రలు, కత్తులు, సైకిల్ చైన్‌లు గాల్లోకి లేచాయి. క్షణాల్లో అక్కడి పరిస్థితి బీభత్సంగా తయారైంది. చుట్టుపక్కల దుకాణాలన్నీ షట్టర్లు దించేశారు. బళ్ళ మీద వ్యాపారం చేసుకునేవాళ్లు ఎక్కడివక్కడ వదిలేసి చెల్లా చెదురైపోయారు. బజార్లో తిరుగుతున్న జనం మూలల నక్కి దాక్కున్నారు.

* * *

విషయం తెలిసిన నారాయణ, ఈశ్వరయ్యలు పరుగున అక్కడికి చేరుకున్నారు. వాళ్ళిద్దరి అరుపులు, అభ్యర్థనలు అరణ్య రోదనలయ్యాయి. కార్చిచ్చుని ఫైరింజన్లతో చల్లార్చగలరా?

పోలీసులు వచ్చి లాఠీ ఛార్జి చేసి, భాష్ప వాయువు ప్రయోగించి పరిస్థితిలో అదుపులోకి తీసుకువచ్చేసరికి-

అక్కడ రెండు శవాలు మిగిలాయి. ఆ శవాల కేసి ఆ ఖాళీ జాగా అలా చూస్తోంది. ●

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్